ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 30 నవంబరు 2025



ప్రశ్నార్థకమవుతున్న ప్రభుత్వ పాఠశాలల మనుగడ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతోందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ లక్ష్మీనారాయణ, రఘుశంకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్క రాంకిషన్‌రావు అధ్యక్షతన శనివారం ట్రినిటి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రకటిత రాజ్యాంగ లక్ష్యాలను విస్మరిస్తూ విద్యా ప్రైవేటీకరణను కార్పొరేట్‌కరణను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని, విద్యార్థుల సంఖ్య తగ్గి మనుగడకే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర కార్యదర్శి రవిచందర్, డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్య క్షుడు నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్యాం, అప్పిడి సంతోష్‌రెడ్డి, పరుశ రాములు, పోచయ్య, జీవన్ రాజు పాల్గొన్నారు.

పల్లెల్లో వేడెక్కిన రాజకీయాలు

- పోటాపోటీగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నామినేషన్లు
- మొదలైన దావతులు, సంప్రదింపులు
- బీసీ, జనరల్ స్థానాల్లో పోటీ ఎక్కువ
- నేటి నుంచి రెండో విడత నామినేషన్లు ప్రారంభం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇప్పుడిప్పుడే రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానా లకు పోటీ చేసే అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొన్నది. బీసీలు, జనరల్‌కు కేటాయించిన సర్పంచ్ స్థానాల్లో పోటీ తీవ్రంగా ఉన్నది. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అని చూస్తు న్న ఆశావహులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఇప్పట్లో ఎన్నికలు జరిగవని కొందరు భావించినప్పటికీ, అకస్మాత్తుగా ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడంతో మొదటి విడతలో పోటీ చేసే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే సర్పంచ్ అభ్యర్థికి కనీసం 10 నుంచి 50 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుండగా, వార్డు సభ్యులకు పోటీచేసే అభ్యర్థులకు లక్ష రూపాయల వరకైనా ఖర్చుఅవుతు న్నాయి. ఈ నేపథ్యంలో డబ్బుల కోసం అప్పులు చేసే పరిస్థితి నెలకొన్నది. అలాగే పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంకుల్లో కరెంట్ అకౌంట్ తీయాలనే నిబంధన ఉండడంతో బ్యాంకుల వద్ద అభ్యర్థులు పడి గాపులు కాస్తున్నారు. చివరి రోజు నామినేషన్లు ముగిసే నాటికి కూడా కొందరికి బ్యాంక్ అకౌంట్లు అందక పోవడంతో నామినేషన్ వేయకుండా ఉండాల్సిన పరి స్థితి ఏర్పడింది.

జిల్లాలో మొదటి విడతలో కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల్లోని 99 గ్రామపంచాయతీలు, 896 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈనెల 27వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటి రోజు అంత హడావుడి లేకపోయినా రెండో రోజు నుంచి నామినేషన్లు జోరందుకున్నాయి. శనివారం సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది.

● మొదలైన దావతులు..

గ్రామపంచాయతీ ఎన్నికలతో రాజకీయాలు వేడెక్కాయి. ఆయా వర్గాల ప్రజల మద్దతు కూడగట్టేందుకు అభ్యర్థులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కుల సంఘాల వారీగా, యువకులను ఆకర్షించేందుకు అప్పుడే దావతులను మొదలుపెట్టారు. గ్రామాల్లో ఎవరిని గెలిపిస్తే బాగుంటుందని చర్చ కూడా ప్రజల్లో మొదలైంది. డిసెంబర్ మూడో తేదీ నాటికి నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా, తప్పనిసరిగా పోటీ లో నిలవాలనుకునే అభ్యర్థులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సారి తమకే మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరుతున్నారు. గ్రామ అభి వృద్ధి, సంక్షేమానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పనులు చేస్తానంటూ వాగ్దానాలు గుప్పిస్తున్నారు. కొందరు అభ్యర్థులు బల నిరూపణ కోసం ర్యాలీలు నిర్వ హించి నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధానంగా జనరల్, బీసీలకు రిజర్వ్ చేసిన సర్పంచ్ స్థానాల్లో పోటీ తీవ్రంగా ఉంది. జనరల్ స్థానాల్లో ఓసీల కంటే ఎక్కు వగా బీసీలు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఇద్దరికీ పైగా నామినేషన్లు వేయగా, వారిని బుజ్జగించేందుకు

(మిగతా 8వ పేజీలో)

చివరి రోజు నామినేషన్ల జోరు

- రాత్రి 11 గంటల వరకు కొనసాగిన నామినేషన్ల పర్వం



రామగిరి మండలంలో నామినేషన్ వేస్తున్న సర్పంచ్ అభ్యర్థి

పెద్దపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన శనివారం జోరుగా నామినేషన్లు దాఖలయ్యాయి. రాత్రి 11 గంటల వరకు కూడా అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే క్లస్టర్ కేంద్రాల్లో నామినేషన్లను దాఖలు చేశారు. మొదటి విడతలో కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, మంథని మండలాల్లోని 99 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలతో పాటు 896 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజైన 27న అంతంత మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్‌కు 106, వార్డు స్థానాలకు 39 నామినేషన్లు వచ్చాయి. రెండో రోజు సర్పంచ్‌కు 184, వార్డు స్థానాలకు 309 నామినేషన్లు వచ్చాయి. చివరి రోజైన శనివారం నామినేషన్లు దాఖలు చేసేందుకు అనేక మంది వచ్చారు. ప్రధాన పార్టీలకు చెందిన కొందరు అభ్యర్థులు బల నిరూపణకు కోసం కార్యకర్తలతో ర్యాలీలు తీశారు. నామినేషన్ పత్రాలు నింపేందుకు అభ్యర్థులు తంటాలు పడ్డారు. ప్రధానంగా పోటీ చేసే అభ్యర్థులు బ్యాంకులో తప్పనిసరిగా కరెంట్ అకౌంట్ తీయాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డారు. కొందరు అకౌంట్ తీయలేక పోటీకి దూరమయ్యారు. నామినేషన్ల స్వీకరణకు శనివారం సాయంత్రం 5 గంటలకు గడువు ముగియడంతో ఆ సమయం వరకు కేంద్రంలో ఉన్న వారందరినీ అనుమతించి రాత్రి 11 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ముత్తారం, తదిత మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో కొన్ని వార్డు స్థానాలకు సింగిల్ నామినేషన్లు వచ్చాయి. ఆదివారం నామినేషన్ల పరిశీలన జరపనున్నారు. వాటిపై వచ్చే అభ్యంతరాలను ఆ మరుసటి రోజు పరిష్కరించనున్నారు. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు.

మొదటి విడత వచ్చిన నామినేషన్లు

మంథని మండలంలో 35 సర్పంచ్ 282 వార్డు స్థానాలకు గాను సర్పంచ్‌లకు 270, వార్డు సభ్యులకు 883 నామినేషన్లు దాఖలయ్యాయి.

ముత్తారం మండలంలో 15 సర్పంచ్ 138 వార్డు స్థానాలకు గాను సర్పంచ్‌లకు 115, వార్డు సభ్యులకు 314 నామినేషన్లు దాఖలయ్యాయి.

కమాన్‌పూర్ మండలంలో 9 సర్పంచ్, 92 వార్డు స్థానాలకు గాను 44 సర్పంచ్, 250 వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలయ్యాయి.

రామగిరి మండలంలో 16 సర్పంచ్, 158 వార్డు స్థానాలకు గాను 159 సర్పంచ్, 445 వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలయ్యాయి.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఆసుపత్రి ఆవరణలో పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యులకు, వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నిర్మాణం పూర్తి చేసుకున్న క్రిటికల్ కేర్ భవనం, ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్, బ్లడ్ బ్యాంక్, సదరమ్ బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, వారికి మెరుగైన వైద్యం అందించాలని, డిసెంబర్ 31నాటికి జనరల్ ఆసుపత్రిలోని ఓల్డ్ బిల్డింగ్‌లో మరమ్మతు పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. క్రిటికల్ కేర్ భవనంలో అవరమైన పరికరాలను త్వరిగతిన తీసుకువచ్చి సేవలను ప్రారంభించాలన్నారు. ఆసుపత్రి పాత భవనం వెనుక సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఆసుపత్రి చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ అరుణశ్రీ, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ, ఆర్ఎంఓలు కృపాభాయ్, టీఎస్ఎంఐడీసీ అధికారులు ఉన్నారు.

పారుపల్లిలో సివిల్ రైట్స్‌డే

ముత్తారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పారుపల్లిలో శనివారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. దళితులపై ఎవరూ వివక్ష చూపించరాదని, ఎవరైనా దళితులను చులకనగా చూస్తూ, దూర్భాషలాడిన, దాడులు చేయడం, ఆలయాల్లోకి అనుమతించకపోవడం, అంటరానివారిగా చూస్తే చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్‌లో శనివారం అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలంతా కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని కోరారు. గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. అలాగే షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులను అంటరాని వారిగా చూడవద్దని, వారిని తక్కువగా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భవాని ప్రసాద్, కార్యదర్శి, జీపీఓ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ చరిత్ర ఉంటుంది



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, చందర్ పుట్ట మధు

పెద్దపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ చరిత్ర ఉంటుందని, ఉద్యమకారులపై గన్ ఎక్కు పెట్టిన చరిత్ర సీఎం రేవంత్ రెడ్డిదని, ఉద్యమంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఎక్కడ ఉన్నాడోనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శనివారం పెద్దపల్లిలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబరు 29 అంటే ఒక చరిత్ర అని, ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి జరిగిన పద్నాలుగేళ్ల సమరమే తెలంగాణ పోరాటం అని గుర్తు చేశారు. 2009 నవంబరు 29న కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్ నుంచి సిద్ధిపేట రంగదాంపల్లిలో ఏర్పాటు చేసిన దీక్షా స్థలానికి కేసీఆర్ బయల్దేరారని, కరీంనగర్ అల్గునూరు చౌరస్తాలో పోలీసులు చుట్టుముట్టారని తెలిపారు. కేసీఆర్ రోడ్డు మీదే దీక్షకు కూర్చున్నా బలవంతంగా ఖమ్మం జైలుకు తరలించారని అన్నారు. చరిత్ర చెరిపితే చెరిగేది కాదని ఈశ్వర్ అన్నారు. కేసీఆర్ సర్కార్ తర్వాత ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి రూపాన్నే మార్చారని, బతుకమ్మ చీరలకు రాంరాంపెట్టి ఇందిరమ్మనే తెలంగాణ తల్లిగా ముందుకు తెస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నీ మాటతప్పా యని, 6 గ్యారెంటీలను, 420 హామీలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధూకర్, కోరుకంటి చందర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్, మూల విజయరెడ్డి, గంట రాములు, కౌశిక్ హరి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పురాజ్ కుమార్, నాయకులు వంగల తిరుపతిరెడ్డి, మోహన్ రావు, నూనేటి సంపత్, సందీప్ రావు, మార్కు లక్ష్మణ్, ఐరెడ్డి వెంకట్ రెడ్డి, కొయ్యడ సతీష్ గౌడ్, బోయిని రాజమల్లయ్య, సూర శ్యామ్, మైలారం నారాయణ, నరేంద్ర రాములు, తీగల సదయ్య, ముత్యాల రాజయ్య, మేడగోని శ్రీకాంత్, మోబిన్, పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, కార్తీక్, బిక్షపతి, స్వామి, సరేష్, ప్రశాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరుల విధ్వంసంపై విచారణ జరపాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి

పెద్దపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను దోచుకోవడంలో బీఆర్ఎస్ పార్టీ అవలంబించిన విధ్వంస రచనను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మానేరు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అంబటి కరుణాకర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మానేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక దందాకు వ్యతిరేకంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ న్యాయస్థానంలో పోరాటం చేశామన్నారు. న్యాయస్థానం సంబంధిత అధికారులకు 50 కోట్ల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. గుంపుల సమీపంలో చెక్ డ్యాంను కొందరు అక్రమంగా ఇసుక తవ్వకాల కోసమే పేల్చి వేశారని, పేల్చిన వారినెవ్వరినీ వదిలి పెట్టబోమని, న్యాయస్థానంలో దోషులుగా నిలబెడతామన్నారు. చెక్ డ్యాం పేల్చివేతపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు వచ్చే నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు 3 నుంచి 8వ తరగతి వరకు న్యూ స్కీం పథకం ద్వారా, 9, 10వ తరగతి విద్యార్థులు రాజీవ్ విద్యా దీవెన ద్వారా ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 9502664044 నెంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ యాకయ్య అన్నారు. శనివారం లాలపల్లిలో జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడారు. గ్రామాల్లో అందరూ కలిసిమెలిసి ఉండాలని, చట్టానికి ఎవరూ అతీతులు కారని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఏఎస్ఐ భాస్కర్, ఆర్ఐ విజయలక్ష్మి, జీపీఓ అనిల్ కుమార్, జీపీ కార్యదర్శి సురేష్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఆంజనేయులు, అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందేలా ప్రణాళిక



యూరియా అమ్మకాలపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రైతుకు అవసరమైన యూరియా అందేలా పక్కా ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం బ్రాహ్మణపల్లి రైతువేదిక వద్ద యూరియా అమ్మకాల పర్యవేక్షణ యాప్‌పై ఎరువుల డీలర్లకు నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది కంటే 7 నుంచి 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగినప్పటికీ వానాకాలంలో యూరియా సమస్య ఉత్పన్నమైందన్నారు. తనిఖీలలో 4 డీలర్ల షాప్‌లను సీజ్ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతీ రైతుకు అవసరమైన మేర యూరియా అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం యూరియా అమ్మకాల పర్యవేక్షణ యాప్ ప్రవేశపెట్టిందన్నారు. యాప్ ద్వారా రైతులు పద్ధతి ప్రకారం సాగు చేసే పంటల ఆధారంగా యూరియా అమ్మకాలు జరపాలని తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంట, ఎంత యూరియా అవసరం అవుతుంది, ఇప్పటి వరకు ఎంత యూరియా కొనుగోలు చేశారు వంటి వివరాలు యాప్ లో నమోదవుతాయన్నారు. రైతు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా ఈ యాప్ ద్వారా నియంత్రించే అవకాశం ఉందన్నారు. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా యూరియా విక్రయం సమయంలో ఈ యాప్ విని యోగించి యూరియా అమ్మకం వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. యూరియా కృత్రిమ కొరత సమస్య యాప్ ద్వారా తొలగిపోతుందన్నారు. యాసంగి సీజన్ కు అవసరమైన యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని తెలిపారు. ఈ యాప్‌ను ప్రతీ ఒక్క డీలర్ తప్పనిసరిగా వినియోగించుకొని రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని, యాప్ వినియోగించని డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు..

- నేలకు, పర్యావరణానికి ముప్పు



రాగినేడులో వరి కొయ్యలు కాల్చుతున్న రైతు

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేశాక వరి కొయ్యలు కాలిస్తే భూసారం తగ్గడంతో పాటు దిగుబడి తగ్గే అవకాశం ఉందని, కొయ్యలు కాల్చకుండా కలియదున్నాలని మండల వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. గతంలో వరి పంటను కొడవళ్లతో కోసి, గ్రామాల్లో పశు సంపద ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలు కుప్పలుగా నిల్వ చేసేవారు. ప్రస్తుతం సాగు విధానంలో మార్పులు వచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వెస్టర్‌లతో వరి కోయడంతో కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవ సరమున్న రైతులు కొంతగడ్డిని తీసుకొచ్చి, మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు. దీంతో దున్నే సమ యంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరి, మొక్కజొన్న కొయ్యలతో పాటు గడ్డిని కాల్చి వేస్తున్నారు. దీంతో అధిక నష్టాలు వచ్చే అవకాశం ఉందని, వరి కొయ్యలను తగులబెట్టొద్దని వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

● కొయ్యల దహనంతో తగ్గుతున్న భూసారం

వరి కొయ్యలను కాలిస్తే రైతులకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమిసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా భూమిలోని నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడి తక్కువగా వస్తుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బ తింటాయి.భూమిలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములు, జీవరాసులు చనిపోతాయి. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.

● కలియ దున్నితే అధిక లాభాలు

వరి కొయ్యలను నేలలో కలియదున్నడంతో సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్‌ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. వరి కొయ్యలు కలియదున్నితే ఎకరాకు దాదాపు టన్నువరకు ఎరువు తయారవుతుంది. మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం ఫాస్పరస్ అదనంగా అందిస్తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటివి పంటకు మేలు చేస్తాయి. నేలలో కరుగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

- అలివేణి, మండల వ్యవసాయాధికారి, పెద్దపల్లి



వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో గాలి, నేల కలుషితమవుతాయి. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. పొలంలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్‌ఫాస్పేట్ చల్లితే వరి కొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతాయి. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడంతో దిగుబడి పెరుగుతుంది.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

జమ్మికుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్‌కు చెందిన పాతకాల విజయరాణి(35) అనే వివాహిత గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేశవపూర్‌కు చెందిన పాతకాల కిరణ్ కుమార్‌కు మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణపూర్‌కు చెందిన విజయరాణితో 16ఏళ్ల క్రితం వివాహమైంది. కిరణ్‌కుమార్ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఆడబ్బులు కటుంబ పోషణకు సరిపోవడం లేదని విజయరాణి తండ్రికి చెప్పుకుంటూ బాధపడేది. దీంతో తల్లి దండ్రులు ఈనెల27న కుమార్తెను చూసేందుకు కేశవపూర్‌కు వచ్చారు. 28న ఉదయంవారు ముందు గదిలో ఉండగా, విజయరాణి వెనుకగదిలో గడ్డిమందు తాగింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. విజయరాణికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె తండ్రి చంద్రయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

మియాపూర్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ అరుణ్ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల నుంచి వారి కుటుంబసభ్యుల మధ్య ఇళ్లు, భూముల పంచాయితీలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అరుణ్‌తో పాటు అయన భార్య మాజీసర్పంచ్ స్వప్నలపై అరుణ్ తల్లి పోలీసులకు పిర్యాదు చేసింది. అయితే ఈ విషయంలో తాము కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని, అయినా తమను పోలీసులు పిలిపిస్తుండడంతో మనస్తాపం చెందిన తన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని అరుణ్ భార్య మాజీసర్పంచ్ స్వప్న వీడియో విడుదల చేసింది. తన భర్త ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆయన ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బోల్తాపడిన ట్రాలీ వ్యాను

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కల్వల శివారులో ఆర్టీసీబస్సు.. ట్రాలీవ్యాన్‌ను ఢీకొంది. దీంతో ట్రాలీవ్యాన్ బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. కొలనూర్‌కు చెందిన ట్రాలీ వ్యాన్ మరమ్మతుల నిమిత్తం పెద్దపల్లికి వస్తోంది. పెద్దకల్వల డిగ్రీకళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కరీంనగర్‌కి వెళ్తున్న బస్ వెనుకనుంచి ఢీకొంది. దీంతోవ్యాన్‌లో ప్రయాణిస్తున్న డ్రైవర్‌వంశీకృష్ణ, రామరాజుకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. రామరాజు సోదరుడు దీపక్ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసంత్ నగర్ అల్ట్రాటెక్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఈసాల తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన తీగల అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై బసంత్‌నగర్ బస్టాండ్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో అదుపు తప్పి అల్ట్రాటెక్ కంపనీ గోడకు ద్విచక్రవాహనం ఢీకొని కిందపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అనిల్‌ను అటుగా వెళ్తున్న స్రవంతి అనే నర్సు సీపీఆర్ చేసింది. అనంతరం అతన్ని 108లో కరీంనగర్ తరలించారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలికను ఒకవ్యక్తి(వివాహితుడు)లోబరుచుకుని కొంతకాలంగా శారీరకంగా ఉపయో గించుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. కాగా ఆవ్యక్తిపై గతంలోకూడా ఓచిన్నారి మృతికేసులో అనుమానాలు వ్యక్తమయ్యాయి. శనివారం కులపెద్దల వద్ద ఈ విషయం వెలుగుచూడగా బాలిక తరపువారు పోలీసులను ఆశ్రయించడంతో సదరు వ్యక్తిపై పోలీసులు పోక్సోకేసు నమోదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



చింతకుంటలో దగ్ధమవుతున్న గుడిసె

కథలాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంటలో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో వేముల శంకర్ అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. భారీగా అగ్నికీలలు ఎగిసిపడడంతో ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. సంఘటనా స్థలంను రెవెన్యూఅధికారులు పరిశీలించారు. కాగా బాధితకుటుంబానికి పలువురు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోల్‌సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని వన్‌టౌన్‌సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం రాత్రి విఠల్‌నగర్‌లో పోలీస్‌కళాబృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనాగంజాయి అమ్మినా, కొన్నా సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో స్వీయ భద్రత కోసం కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్ లింకులు, ఓటీపీ మోసాల గురించి స్పష్టంగా ఉండాలని, మోసాలకు గురైతే వెంటనే 1930నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ రోడ్డు ప్రమాదాలు, గంజాయి, సైబర్‌మోసాలు, మైనర్ల డ్రైవింగ్‌పై కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ అనూష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

నేటితో ముగియనున్న గడువు

- రేపటి నుంచి కొత్త మద్యం దుకాణాలకు అనుమతి
- డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతి



కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు నడుస్తున్న వైన్‌షాపు(ఏ4)ల లైసెన్స్ గడువు ఆదివారంతో ముగియనుంది. సోమవారం (డిసెంబరు 1) నుంచి కొత్త వైన్‌షాపులు అమ్మకాలు సాగించేందుకు 94 లైసెన్సీలకు అనుమతులను జారీ చేశామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు రెండేళ్ల కాలంపాటు మద్యం అమ్మకాలు సాగించేందుకు అక్టోబరు 23న లాటరీ ద్వారా లైసెన్సీలను ఖరారు చేశారు. డిసెంబరు 1 నుంచి వైన్‌షాపుల్లో కొత్తగా లైసెన్స్‌లు పొందిన వ్యాపారులు మద్యం అమ్మకాలు సాగించేందుకు అనువుగా ఆదివారం కరీంనగర్ డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతులు ఇచ్చారు. ఆదివారం సెలవు దినం అయినా నెలాఖరు కావటంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసుకున్న వైన్‌షాపులకు మద్యం సరఫరా చేసేందుకు మద్యం డిపో తెరచి ఉంచుతారు.

● ఎక్సైజ్ ఫీజు.. బ్యాంకు గ్యారెంటీలు

మద్యం షాపుల లైసెన్స్‌లు ఖరారు అయిన తరువాత 94 వైన్‌షాపులకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల రూపాయలు లైసెన్స్‌ఫీజుకాగా ఇందులో 6వ వంతు ఎక్సైజ్ ఫీజు 9 కోట్ల 24 లక్షల 17 వేల రూపాయలు లైసెన్స్‌దారులు ప్రభుత్వానికి చెల్లించారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు 94 వైన్‌షాపుల లైసెన్సీలకు మొదట కన్ఫర్‌మేషన్ లెటర్లు అందజేశారు. మిగతా లైసెన్స్‌ఫీజుకు 25 నెలల వాలిడిటీతో బ్యాంక్ గ్యారంటీలు ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు సమర్పించారు. వైన్‌షాపు ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా షాపు స్థలాన్ని ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం గుడి, బడికి వంద మీటర్ల దూరం, జాతీయ రహదారికి 220 మీటర్ల దూరం, షాపునకు ఆనుకుని వంద మీటర్ల విస్తీర్ణంలో పర్మిట్ గది, తాగునీరు, మూ త్ర శాలలు, పార్కింగ్, సీసీ కెమెరాలు ఉ న్నాయని నిర్ధారించిన తరువాతనే 94 వైన్‌షాపులకు లైసెన్స్‌లను జారీ చేశారు. ఈ ప్రక్రియ శనివారంతో ముగిసింది. న వంబరు 30 రాత్రి 10 గంటలతో పాత షాపుల గడువు ముగియనుండగా ఆ షా పులకు సంబంధించిన మిగిలిపోయిన మ ద్యం స్టాక్‌ను డిపోకు అప్పగించాల్సి ఉంటుంది.

● కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 94 వైన్‌షాపుల లైసెన్స్‌లు ఖరారు కాగా ఎక్సైజ్ శాఖకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల ఆదాయం సమకూరనున్నది. 11 వైన్‌షాపులకు 50 లక్షల వంతున 5.5 కోట్లు, మరో 40 వైన్‌షాపులకు 55 లక్షల వంతున 22 కోట్లు, 43 వైన్‌షాపులకు 65 లక్షల వంతున 27.95 కోట్ల రూపాయలు లైసెన్స్‌ఫీజు కింద సమకూరనున్నది. ఈ 94 వైన్‌షాపులు 5 లక్షల వంతున 4.7 కోట్ల రూపాయలు స్పెషల్ ఎక్సైజ్ టాక్స్‌తోపాటు, దరఖాస్తు ఫీజు రూపంలో 81.9 కోట్ల రూపాయలు, మొత్తం కలిసి మొదటి ఏడాదిలో 142.05 కోట్ల ఆదాయం సమకూరింది.

● కొత్తవారికి గుడ్‌విల్‌ఇస్తూ..

కరీంనగర్ జిల్లాలో 94 వైన్‌షాపుల్లో 25 శాతం షాపులు కొత్తవారికే రావడంతో ఆ షాపులను చాలావరకు మద్యం వ్యాపా రులు లక్షల్లో గుడ్‌విల్ చెల్లించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఒక్కో వైన్‌షాపు డిమాండ్‌ను బట్టి 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు గుడ్‌విల్ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. కొ త్తగా వైన్‌షాపులు పొందినవారికి అడ్డాలు లభించక కొంత ఇబ్బంది పడ్డారు. మరి కొందరు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు.

మావోయిస్టు నేత కాశీరాం లొంగుబాటు

● 1989లో భార్యతో సహా ఉద్యమంలోకి..



సింగరావుపేట గ్రామంలోని కాశీరాం ఇల్లు

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన మావోయిస్టు నేత బత్తుల కాశీరాం మహారాష్ట్ర పోలీసుల ఎదుట శుక్రవారం లొంగిపోయాడు. మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితులైన బత్తుల కాశీరాం, అతని భార్య మల్లవ్వలు ఇద్దరు కుమారులను విడిచిపెట్టి ఉద్యమంలోకి వెళ్లారు. మల్లవ్వ అనారోగ్యంతో ఉద్యమంలో ఉన్న సమయలోనే 2009లో చనిపోయింది. రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన బత్తుల పెద్ద రాజయ్య -పెద్ద గంగవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడైన కాశీరాం మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితుడై భార్య మల్లవ్వతో కలిసి 1989లో మావోయిస్టు ఉద్యమంలో చేరాడు. కాశీరాం, మల్లవ్వలు ఉద్యమంలో చేరే సమయంలో ఇద్దరు కుమారులు ఐదేళ్ల వయస్సు గల పిల్లలు.

ఇద్దరు చిన్న పిల్లలను వదిలి కాశీరాం దంపతులు ఉద్యమం బాట పట్టారు. అప్పటి నుంచి ఉద్యమంలో వివిధ హోదాల్లో వీరిద్దరూ పని చేశారు. ఉద్యమంలో ఉన్నసమయలో కాశీరాం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు పిల్లల కోసమైనా జనజీవన స్రవంతిలో కలవాలని వేడుకున్నా వారు ఉద్యమాన్ని విడిచిరాలేదు. ప్రస్తుతం కాశీరాం పెద్ద కుమారుడు రాజేష్ హైదరాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుండగా, అతని చిన్న కుమారుడు మహేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. మహారాష్ట్ర పోలీసులకు కాశీరాం లొంగిపోయాడన్న సమాచారం మేరకు అతడి తమ్ముడు మహాదేవయ్య మహారాష్ట్రకు వెళ్లాడు.

పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన యువకుడు?

● యువకుడికి ఫిట్స్.. ఆసుపత్రికి తరలింపు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌లో ట్రాలీ ఆటోను దొంగిలించిన అదే గ్రామానికి చెందిన యువకుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. విచారిస్తున్న క్రమంలో యువకుడికి ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కింద పడిపోయాడని తెలిసింది. ఆందోళనకు గురైన పోలీసులు పోలీస్ వాహనంలో మండల కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించారని సమాచారం. ఈ విషయంపై ఎస్‌ఐ రాహుల్‌రెడ్డిని వివరణ కోరగా వాహనం ఎత్తుకెళ్లారని బాధితులు తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. బాధితుల సమీప బంధువు చోరీ చేయడంతో అతన్ని అదుపులోకి తీసుకుని మాట్లాడుతున్న క్రమంలో ఫిట్స్ రావడంతో అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారని ఎస్‌ఐ వివరించారు.

తల్లీకొడుకులకు కన్నీటి వీడ్కోలు

● చితికి నిప్పుపెట్టిన కుమార్తెలు

తంగళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన తల్లీ కొడుకులకు బంధువులు, మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆత్మహత్యకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత ఆమె కుమారుడు అభిలాష్ అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. తల్లి కొడుకుల మృతదేహాలను ట్రాక్టర్‌పై పక్కపక్కనే పెట్టి అంతిమయాత్ర చేపట్టగా దారి వెంట స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. తల్లి లలిత చితికి పెద్ద కూతురు మౌనిక నిప్పుపెట్టగా, అన్నయ్య అభిలాష్ చితికి సోదరి మానస నిప్పుపెట్టింది. ఈ దృశ్యం బంధువులను, మిత్రులను కంటతడి పెట్టించింది.



అభిలాష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ సురేష్

● నివాళులర్పించిన కమాండెంట్..

తంగళ్లపల్లిలో అభిలాష్ భౌతికాయానికి 17వ బెటాలియన్ కమాండెంట్ సురేష్‌తోపాటు కానిస్టేబుళ్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో, క్రమ శిక్షణతో పనిచేసిన సిబ్బందిలో అభిలాష్ ఒకరిగా నిలిచారని కొనియాడారు. ఆయన మృతి పోలీస్‌శాఖకు తీరనిలోటని పేర్కొన్నారు. అనంతరం అభిలాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పథకం ప్రకారమే సిద్ధన్న హత్య

● ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి



హత్యకేసులో అరెస్ట్ అయిన సంతోష్

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంలోని గుర్రవానిపల్లె ఎదురుగా ఉన్న అగ్రహారం గుట్టల్లో ఈ నెల 27న బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న హత్యకేసులో ప్రధాననిందితుడైన జక్కుల సంతోష్‌ను అరెస్టుచేసినట్లు వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం... జిల్లాలోని తంగళ్ల పల్లిమండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన సిద్ధన్న అప్పటి పీపుల్స్‌వార్ దళ కమాండర్‌గా పనిచేశాడు. ఈసమయంలో వీర్నపల్లి బస్టాండ్‌వద్ద 1999లో జక్కుల అంజయ్యను పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా భావించి కాల్చివేసిన ఘటనలో అతనిపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనపై అంజయ్య కుమారుడు జక్కుల సంతోష్ తనతండ్రిని చంపిన వ్యక్తిపై కక్షపెంచుకున్నాడు. దీంతో పథకం ప్రకారం సిద్ధన్నపై రాళ్లతో దాడిచేసి హత్యచేశాడు. ఈ ఘటనపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో సంతోష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఇంచార్జి డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ హత్య కేసును చేధించిన వేములవాడటౌన్ సిఐ వీరప్రసాద్, ఎస్‌ఐ రామ్మోహన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రాజన్న కోడెల తరలింపుపై విచారణకు ఈవో ఆదేశం

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతఏడాది జనవరిలో రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాల నుంచి నాలుగు కోడెలను అక్రమంగా తరలించిన వ్యవహారంలో విచారణ చేపట్టాలని శనివారం ఆలయఈవో రమాదేవి అధికారులను ఆదేశించారు. వేములవాడ దేవస్థానం గోశాలనుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని దుబ్బతండాకు చెందిన సోమేశ్వర గోసంరక్షణ సేవాసంఘం ఆధ్వర్యంలో వ్యాన్‌లో కోడెలను తరలిస్తుండగా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద అక్రమంగా తరలిస్తున్నారని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆపేశారు. ఈ వాహనాన్ని కార్యకర్తలు తనిఖీచేసిన సందర్భంలో 24కోడెలు ఉన్నాయి. అయితే అనుమతి మాత్రం 20కోడెలకే ఉండడంతో మరో 4కోడెలు ఎక్కడివని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రశ్నించారు. అదనంగా నాలుగు కోడెలు ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదైంది. అదే సమయంలో ఇద్దరు ఆలయ ఉద్యోగులకు చార్జి మెమో జారీకి తదుపరి చర్యలకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో శాఖాపరమైన సమగ్రవిచారణ చేపట్టాలని ఏఈవోను విచారణాధికారిగా నియమిస్తూ ఈవో ఆదేశాలు జారీచేశారు.

16 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారితో పాటు గతంలో ఎన్నికల కేసులున్న పాత నేరస్తులు, సస్పెక్ట్‌షీటర్లు 16మందిని శనివారం బైండోవర్‌చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. 4 కేసుల్లో 16మందిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు, లక్షరూపాయల చొప్పున సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ డీసీపీ

జమ్మికుంట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంభునపల్లి శివారులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభించిన సంఘటనస్థలాన్ని అడిషనల్‌డీసీపీ వెంకటరమణ శనివారం పరిశీలించారు. 30-35సంవత్సరాల వయస్సు యువకుడిని హత్యచేసి గోనె సంచులు, చద్దర్లలోచుట్టి రోడ్డుపక్కన పత్తిచేనులో పడేశారు. యువకుడిని గుర్తించేందుకు అతడు ధరించిన దుస్తులు, చెవిపోగు, చేతికి కంకణాలు ఇతర ఆనవాళ్లను రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించినట్లు తెలిసింది. హత్య ఘటన వెలుగు చూడకముందు ఆ రోడ్డులో పెళ్లి బారత్‌లు జరిగాయని, పరిమల సొసైటీ రోడ్డులో నిత్యం అర్ధరాత్రివరకు ఆకతాయిలు మద్యం తాగుతారని స్థానికులు తెలిపారు. డీసీపీవెంట హుజూరాబాద్ ఏసీపీమాధవి,సీఐ రామకృష్ణగౌడ్ ఉన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వ్యవసాయ బావి మోటారు వైర్ చోరీ

వీణవంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ వంగల కొండాల్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావి వద్ద స్టాటర్‌తోపాటు మోటర్‌వైరును శనివారం దొంగలు ఎత్తుకెళ్లారు. తరచూ మోటార్ల కాపర్‌వైర్ ఎత్తుకెళ్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోరుట్లలో రెండిళ్లలో చోరీ

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రవీంద్ర రోడ్డులో శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగింది. సీసీ ఫుటేజీలకు ఉన్న వైర్లను తొలగించి దొంగలు ఇండ్లలో చొరబడి దొంగతనం చేశారు. రవీంద్ర రోడ్డులో నివాసం ఉంటున్న కటకం రాజారాం దంపతులు గురువారం ఇంటికి తాళంవేసి బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం తిరిగిరాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు అభరణాలు రూ. 25అపహరణకు గురయినట్లు బాధితుడు తెలిపాడు. అదేకాలనీకిచెందిన ఇలుటపు భూమయ్య తన చిన్న కుమారుడి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద కుమారుడి ఇంటి వద్ద నిద్ర పోయాడు. ఇంటి ముందర ఉన్న సీసీకెమెరా వైర్లను కట్‌చేసి దుండగులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. భూమయ్య ఉదయం చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉన్న విషయం కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమచారం అందించారు. ఇంట్లోని బీరువాలోఉన్న రెండుతులాల బంగారు అభరణాలు, మూడుతులాల వెండిఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్‌ఐ చిరంజీవి కేసునమోదు చేసి క్లూజ్‌టీంతో తనీఖీలు నిర్వహించారు. కాగా కత్తులతో ముగ్గురుదొంగలు ఆ ప్రాతంలో సంచారం చేస్తునట్లు పోలీసులు సీసీఫుటేజ్ ద్వారా గుర్తించారు.



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతారం గ్రామ శివారులో పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నారు. శనివారం చిట్టాపూర్ గ్రామశివారులో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



చిట్టాపూర్ శివారులో పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన బోయిని అశోక్ వద్ద నిల్వ ఉన్న రూ.27వేల విలువైన మద్యాన్ని శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. సీతంపేటలో తనిఖీలు నిర్వహిస్తుండగా, గ్రామానికి చెందిన అశోక్ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు, అతడిపై కేసునమోదు చేసినట్లు ఎస్సైక్రాంతికుమార్ తెలిపారు.

కథల పోటీలో 'మూఢనమ్మకాలు'కు చోటు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో ప్రభాకర్

ధర్మారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన కథల పోటీలో నర్సింహులపల్లి విద్యార్థి రాసిన "మూఢ నమ్మకాలు" కథకు చోటు దక్కింది. బాలల దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్స్ ఎడ్యు కేషనల్ అకాడమీతోపాటు బాలచెలిమి పిల్లల మాసపత్రిక జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 714మంది తాము రాసిన కథలను పోస్ట్‌ద్వారా పంపగా, 16ఉత్తమ కథలను ఎంపికచేశారు. ఎంపికైన 16ఉత్తమ కథల్లో మండలంలోని నర్సింహులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న గంగారపు శృతి రాసిన మూఢనమ్మకాలు కథకు చోటుదక్కింది. ఎంపికైన 16మంది విద్యార్థులకు డిసెంబర్ 22న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు షీల్డ్, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. ఉత్తమ కథలను పుస్తకరూపంలో తీసుకురానున్నట్లు నిర్వాహకులు మణికొండ వేదకుమార్, గరిపెల్లి అశోక్ తెలిపారు. పిల్లలు రచనలు చేసేలా కృషిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు కందుకూరి భాస్కర్‌ను ఎంఈవో పి ప్రభాకర్ అభినందించారు. విద్యార్థి శృతిని ఉపాధ్యాయులు రమేష్, నరేందర్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి, రామచంద్రారెడ్డి, సతీష్ కుమార్, సీఆర్పీ శ్రీలత అభినందించారు.

ఆర్చరీలో చికితకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్‌తో చికిత

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఖేలో ఇండియా ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఖేలో ఇండియాలో భాగంగా యూనివర్సిటీ స్థాయిగేమ్స్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఆర్చరీ పోటీల్లో ఆమె బంగారం పతకం సాధించి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకు వచ్చింది. ఈ మేరకు ఎమ్మెల్యే విజయరమణరావు బంగారం పతకం సాధించిన చికితను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావుతోపాటు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ చికితను అభినందనలతో ముంచెత్తారు.

ఇండియన్ నేవీ సబ్ లెఫ్టినెంట్‌గా గంభీరావుపేట యవకుడు



నిహాంత్‌గౌడ్

గంభీరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన నిహాంత్‌గౌడ్ అనే యువకుడు ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో శనివారం నిహాంత్‌గౌడ్ విధుల్లో చేరారు. నిహాంత్‌గౌడ్ 6వతరగతి నుంచి ఇంటర్‌వరకు కోరుకొండ సైనిక్‌స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఇంటర్ పూర్తిచేశాక పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ మూడేళ్లపాటు శిక్షణ పొందాడు. తరువాత ఇండియన్ నేవల్ అకాడమీలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నాడు. తాజాగా ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా నిహాంత్‌ను తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు. గంభీరావుపేటలో తన స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయం తనిఖీ


హుజూరాబాద్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని అడిషనల్ డీసీపీ వెంకటరమణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. చల్పూర్ వంటి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇటీవల జమ్మికుంట ప్రాంతంలో జరిగిన హత్య కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

లెక్క దాటొద్దు..

- ప్రతి పైసా లెక్క చెప్పాల్సిందే
- ప్రచారంపై నిరంతరం నిఘా కన్ను
- మండలాల వారీగా వ్యయపరిశీలకుల నియామకం
- ఎంసీసీ అమలుకు పకడ్బందీగా చర్యలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల పోరుకు తెరలేచింది. తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆదివారం రెండోవిడత మొదలైంది. నామినేషన్లు దాఖలు నుంచి అభ్యర్థులు ఖర్చులకు వెనుకాడకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తుంటారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చుపెట్టే ప్రతి పైసా లెక్క చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం మాత్రం ఖర్చు పరిమితిపై నిఘా పెట్టింది. ఎన్నికల ప్రచార ఖర్చుకు పరిమితి, నిబంధనలను రూపొందించింది. పరిమితికి మించి ఖర్చు చేసే అభ్యర్థులపై వేటు తప్పదు. ఇందు కోసం అభ్యర్థుల ఖర్చుల పరిశీలనకు మండలాల వారీగా వ్యయపరిశీలకులను నియమించారు. ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. దీంతో ధన, పలుకుబడి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. వీరితో పాటు పార్టీలకు సంబంధం లేని వారు కూడా అనేకమంది బరిలోకి రావడానికి సిద్ధమవుతున్నారు. పోటీ చేసే అభ్యర్థులు మాత్రం ఎన్నికల సంఘం విధించిన ఖర్చు పరిమితికి లోబడే ఉండాలి.

● చికెన్ బిర్యానీ రూ 100. మటన్ రూ. 120

లస్సీ, సాఫ్ట్ డ్రింక్ ఒకటి రూ 10, వాటర్ ప్యాకెట్ ఒక రూపాయి, వాటర్ బాటిల్ రూ 20, వాటర్ క్యాన్ 20లీటర్లు రూ10, టీ రూ 5, కాఫీ రూ 10, బ్రేక్ ఫాస్ట్ రూ 35, వెజిటేబుల్ ప్లేట్ భోజనం రూ.50, నాన్ వెజిటేబుల్ ప్లేట్ రూ. 100, చికెన్ బిర్యానీ రూ. 100, మటన్ బిర్యానీ రూ. 120, పెద్ద సమోసా ఒక టి రూ 6, చిన్న సమోసా రూ 2, ప్లేట్ మిర్చి, బజ్జీ, పకోడి రూ. 20, లెమన్ బియ్యం ప్లేట్ రూ.40 ధరలను నిర్ణయించారు. పంచాయతీ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ప్రచా రానికి అభ్యర్థుల ఖర్చులపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు.

● సర్పంచ్‌కు రూ. 1.5లక్షల నుంచి రూ 2.5 లక్షలు

ఐదు వేల జనాభాలోపు గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థి రూ1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 30 వేలు, 5 లక్షలపైగా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ 2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 50 వేలు ఖర్చు పరిమితి ఉంది. ఎన్నికల సామగ్రికి లెక్క ఉంది ప్రచారానికి ఉపయోగించే సామాగ్రికి లెక్క ఉంది. 76 రకాల సామగ్రికి రేట్లు ఎన్నికల సంఘం నిర్ణయించింది. రోజుకు లౌడ్ స్పీకర్ అద్దె 100 వాట్స్ రూ.500, 200 వాట్స్‌కు రూ 1300, డీజేకు రూ.2 వేలు, ఎల్ఈడీ స్క్రీన్‌కు సైజ్‌ను బట్టి ఒకరోజు కిరాయి రూ.5 వేల నుంచి 12 వేలు, వాహనంపై ఎల్ఈడీ అమర్చితే రూ.8 వేలు నుంచి 20 వేల వరకు చార్జీలు నిర్ణయించారు. వీడియోగ్రాఫర్ కెమెరాతో కలిపి నెలకు రూ 22,050, డ్రోన్ కెమెరాకు ఒక రోజు రూ3,500, ఆడియో క్యాసెట్ రికార్డు రూ 2,500, ఆటోతో రూ 3 వేలు, నలుగురైదుగురు కూర్చునే వేదిక రోజుకు రూ 150 నుంచి రూ 2800 వరకు ఉంది. క్లాత్ బ్యానర్లు ఫీట్లలో సైజ్‌ను బట్టి రూ. 9 నుంచి రూ 13 వరకు, ఫ్లెక్సీ బ్యానర్లు స్క్వైర్‌ఫీట్ రూ. 7 , హోర్డింగ్ ఫ్లెక్సీ రూ5 వేల నుంచి రూ 6వేల వరకు ధర నిర్ణయించారు.

ఒక బ్యాడ్జీ రేటు రూ 10, పోస్టర్లలో మల్టీకలర్ సంఖ్యను బట్టి రూ 8,500 నుంచి 75 వేలు , పూల దండ చిన్నది రూ 50, కలర్ పేపర్లతో రూ 150,పూలతో రూ 400 ,కరపత్రాలు ఇకటి రూపాయి,శాలువ రూ 50, ప్లకార్డులు రూ 25, జెండాలు రూ 5 నుంచి రూ 18 వరకు, డ్రైవర్‌తో కలిపి కారు, జీపు,టెంపో, ట్రక్, వాహనాల అద్దె రూ 2500, ఇన్నోవా,సూమో రూ. 3500, కారు రూ 2 వేలు, మూడు చక్రాల వాహనం రూ850, డిసిఎం వ్యాన్ రూ 3వేలు, మినీ బస్ 25 సీట్ల పరిమితి రూ4500, టాటా ఎసీ వాహనం రోజుకు రూ 1600, బొలెరో రూ 3000, డీలక్స్ రూ 2,200, సాధారణ గది రూ 1,200, ఏసీ ఫంక్షన్ హాల్ కుర్చీలతో అర్బన్‌లో రూ 15 వేలు, రూరల్‌లో ఏసీ ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, అర్బన్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ8 వేలు, రూరల్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, టెంట్ బట్టి రూ800, సైడ్‌వాల్స్ రూ 30,కార్పెట్లు రెడ్ రూ 350,పెద్ద సైజ్ గ్రీన్ రూ 600 నిర్ణయించారు.

కార్పొరేట్ కళాశాలల మోసం

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియెట్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆరోపించారు. శనివారం తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డుకార్యదర్శి శ్రీకృష్ణ ఆదిత్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరిట దోపిడీ చేస్తున్నాయని, స్క్రీనింగ్‌టెస్టులు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థికభారం మోపుతున్నాయన్నారు. ఒకే పేరుతో అనుమతి తీసుకొని దానికి అదనంగాబ్రాంచ్‌లు నడుపుతున్నాయ న్నారు. నిబంధనలు పాటించని కళాశాలల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం స్వల్పంగా నీరు వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 457 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 948.168 టీఎంసీల నీరు వచ్చిచేరగా, ప్రాజెక్టు నుంచి 880.455 టీఎంసీలనీరునుదిగువకు వదిలారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

● సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల పోరాటాల ద్వారానే హక్కులు సాధిస్తామని సీపీఐ జాతీయనాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగే ఏఐటి యూసీ అనుబంధమైన ఆల్ ఇండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలోని 14రాష్ట్రాలలో బీడీపరిశ్రమల్లో 75లక్షలమంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. బీడీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. 1965లో ఏఐటియూసి అనుబంధంగా బీడీవర్కర్స్ ఫెడరేషన్ కమిటీ ఏర్పాటైందన్నారు. అప్పటినుంచి అనేక ఐక్యఉద్యమాలు చేపడుతూ బీడీ కార్మికు లకు కనీస కూలీపెంపు, ప్రావిడెంట్ ఫండ్, బోనస్, సెలవు, పనిదినాలు, తదితర హక్కులు కాపాడుకోవటం కోసం పోరాటం చేశారన్నారు.

బీడీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భంగా డిసెంబర్ 2వ వారంలో నిర్వహించే సేవ్ ఇండియా- సేవ్ బీడీ వర్కర్స్ నినాదంతో చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి గోవర్ధన్ మాట్లాడుతూ బీడీకార్మికులకు దేశవ్యాప్తంగా ఒకే వేతనం అమలుచేయాలన్నారు. ప్రతి వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలని, బీడీ పరిశ్రమలో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలన్నారు. జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఇంచార్జి ఎస్. విలాస్, ఆల్ ఇండియా సిగార్, టాబాకో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కాశీవిశ్వనాథం, జాతీయ అధ్యక్షుడు కార్బర్ ఉగ్లే, జాతీయ ఉపాధ్యక్షులు నవాబ్, రాష్ట్ర బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, బీడీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొక్కుల శాంత, అధ్యక్షులు కె. అనసూర్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు దేవదాసు, లక్ష్మన్, పోచమల్లు, శాంత, రాధ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి, కొండగట్టుకు భక్తుల తాకిడి



ధర్మపురిలో అభిషేకాది పూజల్లో పాల్గొన్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయ క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. భక్తులు కుంకుమార్చన, నరసింహహోమం, స్వామివారల నిత్య కల్యాణం జరిపించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావిచెట్టు, ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, భక్తులకు సేవలు అందించారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

హాల్ టికెట్ల కోసం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

తిమ్మాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు ఫీజు చెల్లించాలని యాజమాన్యం హాల్‌టికెట్లను నిలిపివేసిందని శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు, కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది. అంతకు ముందు తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు కౌన్సెలింగ్‌లో ఫ్రీసీటు వచ్చిందనిచెప్పడంతో చేర్పించామన్నారు. ఇప్పు డేమో ఫీజులు చెల్లించమంటున్నారని వాపోయారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న విద్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తు న్నారని ఆరోపించారు. ఈ విషయంపై వాగేశ్వరి కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా 2024సెప్టెంబరులో విద్యార్థులు 30వేల ఫీజు చెల్లించాలని జీవో విడుదలైందని, దానిపై పూర్తి క్లారిటీ ఇవ్వలేదని తెలిపింది. ఈ ఏడాది బీసీ, ఓసీలు రూ.15వేలు ఫీజు చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొంది.దీంతో కళాశాల ఫీజు రూ.15వేలు, యూనివర్సిటీ ఫీజు రూ.2100 మొత్తం రూ.17100 చెల్లించాలని 20రోజుల క్రితమే విద్యార్థులకు సమాచారమిచ్చామన్నారు. పరీక్షలు రాయకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టేందుకు హాల్ టికెట్‌లను నిలిపివేయలేదని, ఇంకా సమయం ఉందని ఆలోపు హాల్ టికెట్‌లను ఇచ్చే వారిమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు అనంపల్లి వినయ్‌సాగర్, జిల్లాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడిజిల్లా వాలీబాల్ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలబాలికల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈనెల 24న జిల్లాకేంద్రంలోని మినీస్టేడియంలో అసోసి యేషన్ బాలబాలికల జట్లకు ప్రత్యేకంగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసింది. శిక్షణ శిబిరానికి ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలురజట్టులో 16మంది, బాలికలజట్టులో 16మంది క్రీడాకారులను ఎంపికచేశారు. వీరికివసతి కల్పించి ఉదయం, సాయంత్రం వాలీబాల్ కోచ్‌లు సంపత్‌కుమార్, జగన్ పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించారు.

● నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు..

జిల్లాకేంద్రం మినీస్టేడియంలో ఆదివారం నుంచి జరుగనున్న 8వతెలంగాణ రాష్ట్రస్థాయి జూని యర్స్ వాలీబాల్ పోటీలకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నాలుగు వాలీబాల్ కోర్టులను సిద్ధం చేశారు. రాత్రిసమయంలో వాలీబాల్ పోటీలకు ఆటకం లేకుండా లేకుండా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 10బాలురు జట్లు, 10బాలికలజట్లు పాల్గొంటున్నాయి. పోటీలలో పాల్గొంటున్న బాలబాలికలు 240,దాదాపు 50మంది అఫీషియల్స్‌కు స్టేడియం సమీపంలో వసతి సౌకర్యం కల్పించారు.

ఆల్ ఇండియా పోలీస్ మీట్‌కు వినీత్



వినీత్

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన హాకీ క్రీడాకారుడు మోటపోతుల వినీత్ ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపికయ్యాడు. డిసెంబరు 4నుంచి 15వరకు గుజరాత్ రాజకోట్‌లో మీట్ నిర్వహించనున్నారు. వినీత్ హైదరాబాద్‌లో స్పెషల్ అర్మడ్ రిజర్వు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, బొడిగె తిరుపతి, శంకర్, శ్యామ్, సజ్జు, సాయికృష్ణ, విక్రమ్, సాంబరాజు, వంశీ, వినయ్, పరబ్రహ్మం హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన నిట్టూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ ఖోఖోపోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని నిట్టూరు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఈనెల 28నుంచి 30తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాలలో చదు వుతున్న టీనా, బాలసాని సిర, భూషనవేణి వినయ్, సాగలసంజయ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

గంగాధర : గంగాధర మోడల్‌స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నాగరాజు తెలిపారు. పాఠశాలకు చెందిన అక్షయ, అర్చన, సాన్విత ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపాల్ పద్మ, పీఈటీ నాగరాజు అభినందించారు.

రిజర్వేషన్‌పై కోర్టులో పిటిషన్

ఎలిగేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 17 ప్రకారం శివపల్లి, లాలపల్లి గ్రామాల్లో అధికారులు నిబంధనలు పాటించకుండా రిజర్వేషన్ ఖరారు చేశారని మాజీ వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామి గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విలేకరులతో మాట్లాడుతూ శివపల్లి 2013లో జరిగిన ఎన్నికల్లో జనరల్ కేటగిరిలో రిజర్వేషన్ కల్పించగా, 2018 ఎన్నికల్లో జనరల్ మహిళా, అలాగే ప్రస్తుతం మళ్ళీ జనరల్ మహిళకు రిజర్వేషన్ కల్పించినట్లుగా పిటిషన్‌లో పేర్కొన్నారు. లాలపల్లిలో 2018లో జనరల్ మహిళకు రిజర్వేషన్ కల్పించి 2025 ఎన్నికల్లో జనరల్ కేటగిరిలో రిజర్వేషన్ ఇచ్చారన్నారు. వరుసగా అవే రిజర్వేషన్‌లు కేటాయిస్తూ రోటేషన్ పద్ధతి పాటించకుండా మిగితా వర్గాలకు అన్యాయం చేశారని ఆయన తెలిపారు. పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు రానున్నట్లు తెలిపారు.

గుంతలను పూడ్చిన అధికారులు



గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు

కళ్యాణ్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో నూతన బిల్డింగ్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. ఈనెల 23న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా శనివారం అధికారులు గుంతలమయంగా మారిన రోడ్డును మట్టితో పూడ్చి చదును చేశారు. కొంత కాలంగా నూతన భవనానికి వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారి రాత్రి వేళల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారని కథనానికి స్పందించిన అధికారులు మరమ్మతులు చేశారు.

ఉపాధ్యాయులకు వర్క్‌షాప్

జ్యోతినగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీలోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఒకరోజు ఉపాధ్యాయుల వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు మోటివేటర్ వనేజమని తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీపీసీ సీనియర్ మేనేజర్ గుమగోంకర్, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్‌లు పలు అంశాలను పరిశీలించారు. వర్క్‌షాప్ ద్వారా ఉపాధ్యాయులకు విలువైన జ్ఞానాన్ని, వృత్తిలో వారి స్థాయిని నిర్ధారించి మార్కులను అందించారు. సచ్‌దేవా స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ జీయన్ చంద్, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంఫర్ట్ స్కూల్‌లో ఘనంగా కలర్స్ డే



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కమాన్‌పూర్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ పాఠశాలలో శనివారం కలర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఇందులో విద్యార్థులు రంగు, రంగుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్, సౌమ్య కలర్స్ డే ప్రత్యేకత వివరించారు. డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు డాక్టర్ విజయ్‌కుమార్ బహుమతి ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే

కమాన్‌పూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో నో బ్యాగ్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శనివారం పుస్తకాలు, బ్యాగులు తీసుకురాకుండా రోజంతా ఆటాపాటలతో గడిపారు. వివిధ పాటలకు డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. కరస్పాండెంట్ చదువు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కావద్దని, మానసిక ఉల్లాసం కోసమే నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రాజమణి, భూలక్ష్మి, గౌతమి, నాగరాణి, రాణి, ప్రియాంక, సంధ్య, చామంతి తదితరులు పాల్గొన్నారు.

కాకతీయలో గ్రాండ్ పేరెంట్స్ డే సెలబ్రేషన్స్



వేడుకకు హాజరైన గ్రాండ్ పేరెంట్స్

మంథని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ హైస్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే సెలబ్రేషన్స్ శనివారం నిర్వహించారు. విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు వారి గ్రాండ్ పేరెంట్స్‌తో ఎక్కువ కాలం గడపడం వలన నైతిక విలువలను అలవర్చుకోవటానికి వీలు కల్గుతుందన్నారు. విద్యార్థులంతా గ్రాండ్ పేరెంట్స్‌తో కార్యక్రమానికి హాజరై ఎంజాయ్ చేశారు. పాఠశాల డైరెక్టర్ రవి కిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, ప్రసంతి, పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివసేన మండల కమిటీ నియామకం

కమాన్‌పూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శివసేన మండల కమిటీని శనివారం ప్రకటించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, అధ్యక్షుడిగా గన్నెవరపు రవి, ఉపాధ్యక్షుడిగా బిల్లా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దేవునూరి చంద్రమౌళి, తూండ్ల శ్రీనివాస్, గుంపుల సతీష్, తాటికొండ రాజశేఖర్, గర్రెపల్లి సత్యం, జమాల్‌పురి శ్యామ్‌లాల్, చిర్ర సత్యం, ఎరువ సత్యరాం, కూనారపు సతీష్, కోరే ఐలయ్య, దయ్యాల చిన్నరమేష్, గొట్టె సంపత్, కాంపెల్లి రాజశేఖర్, దేవ నాగరాజు, ఉమ్మల్ల అశోక్, సుద్దాల కృష్ణమూర్తి, కుక్క సతీష్‌లు నియమితులైనట్లు వారు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

ముత్తారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయ అరుణ, సుచరిత అన్నారు. జడ్పీహెచ్ఎస్‌లో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముందుగా బాల్య వివాహ నిర్మూలన చట్టంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యతన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్‌హెల్ప్‌లైన్ నంబర్ 1098, 112,100లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అంజేశారు. ఎంపీడీవో ఏం.సురేష్, ఎంపీవో పవన్‌కుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో విడత నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని 30 గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఆదివారం నామినేషన్‌లు స్వీకరించేందుకు 12 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తెలిపారు. అప్పన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో అప్పన్నపేట, చీకురాయి రైతువేదికలో భోజన్నపేట, చీకురాయి, బొంపల్లి గ్రామపంచాయతీలో బొంపల్లి, కనగర్తి, కాపులపల్లి, ముత్తారం గ్రామపంచాయతీలో గౌరెడ్డిపేట, హన్మంతునిపేట, ముత్తారం, కాసులపల్లి గ్రామ పంచాయతీలో కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం, కొత్తపల్లి రైతువేదికలో కొత్తపల్లి, మూలసాలరాంపల్లి రైతువేదికలో మారేడుగొండ, గుర్రాంపల్లి, రాంపల్లి, పెద్దకల్వల గ్రామ పంచాయతీలో పెద్దకల్వల, పెద్దబొంకూర్, నిమ్మనపల్లి, రాఘవపూర్ రైతువేదికలో రాఘవపూర్, అందుగులపల్లి, బ్రాహ్మణపల్లి రైతువేదికలో రాగినేడు, కుర్మపల్లి, బ్రాహ్మణపల్లి, రంగాపూర్ గ్రామ పంచాయతీలో సబ్బితం, రంగాపూర్, దేవునిపల్లి, తుర్కలమద్దికుంట గ్రామ పంచాయతీలో తుర్కలమద్దికుంట, నిట్టూరు గ్రామాల పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పాలకుర్తి,(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆదివారం నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఎంపీడీవో పొల్సాని శశికళ మాట్లాడుతూ కన్నాల జీపీ భవనంలో కన్నాల, బామ్లానాయక్ తండా, ఎల్కలపల్లి పంచాయతీలో ఎల్కలపల్లి రాణా పూర్, గుంటూర్‌పల్లి, బసంత్‌నగర్‌లో బసంత్‌నగర్, గన్ శ్యామ్‌దాస్‌నగర్, పాలకుర్తి జీపీలో పాలకుర్తి, ఈసాల తక్కళ్లపల్లి, రామరావుపల్లి జీపీలో రామరావుపల్లి, కొత్తపల్లి, పుట్నూర్ జీపీలో పుట్నూర్, జయ్యారం, గుడిపెల్లి, కుక్కలగూడూర్ జీపీలో కుక్కలగూడూర్, వేంనూర్ గ్రామాలకు కేటాయించారు. అభ్యర్థులు ఆదివారం నుంచి మంగళవారం వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటలలోపు నామినేషన్లు సమర్పించాలన్నారు.

డీజే, ర్యాలీలు నిషేధం

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఎస్ఐ నూతి శ్రీధర్ తెలిపారు. ఆదివారం నామినేషన్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు డీజే సౌండ్స్, ర్యాలీలు తీయడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చట్టరీత్యా చర్యలు తీసుకొంటామన్నారు.

చివరి రోజు హోరాహోరీగా నామినేషన్ల దాఖలు

మంథని/మంథనిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ 282 వార్డు స్థానాలకు చివరి రోజు శనివారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. సాయంత్రం 5 గంటల వరకు కేంద్రానికి వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి రాత్రి వరకు నామినేషన్లను స్వీకరించారు. మూడు రోజుల పాటు కొనసాగిన 35 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు మొత్తం 270, 282 వార్డు స్థానాలకు 613 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు సర్పంచ్ స్థానాలకు ఆరెంద-3, నాగెపల్లి-6, కన్నాల-7, నాగారం-5, అక్కెపల్లి-7, మల్లెపల్లి-4, పుట్టపాక-6, తోటగోపయ్యపల్లి-1, పోతారం-4, విలోచవరం-5, ఉప్పట్ల-5, ఎక్లాస్‌పూర్-5, సూరయ్యపల్లి -7, ఖానాపూర్-7, గుమ్మునూరు-6, అడవిసోమన్‌పల్లి -4, సిరిపురం-6, గుంజపడుగు-9, చిల్లపల్లి-3, నగరంపల్లి-1, లక్కెపూర్-5, గద్దలపల్లి-3, బిట్టుపల్లి-2, చిన్నఓదాల -3, మైదుపల్లి-2, గాజులపల్లి-5, కాకర్లపల్లి-5, రచ్చపల్లి-3, ఖాన్‌సాయిపేటలో-3, నాగెపల్లిలో-6, బెస్తపల్లిలో-6, దెబ్బపల్లిలో-1, చిల్లపల్లిలో-3, రచ్చపల్లిలో-3 దాఖలు చేశారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు చివరి రోజు నామినేషన్ల ప్రక్రియలో పెద్దసంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కల్వచర్ల క్లస్టర్ పరిధిలో నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా మిగతా ఆరు క్లస్టర్‌లలో అభ్యర్థులు క్యూలో ఉన్నట్లు ఎంపీడీవో శైలజారాణి తెలిపారు.

గ్రామం	సర్పంచ్	వార్డు సభ్యులు
ఆదివారంపేట్	7	27
బేగంపేట్	9	27
బుధవారంపేట్	7	25
చందనాపూర్	4	18
జల్లారం	15	33
కల్వచర్ల	13	34
లోంకకేసారం	6	15
లద్నాపూర్	11	32
ముస్యాల	12	22
నాగెపల్లి	6	30
నవాబ్‌పేట్	6	18
పెద్దంపేట్	4	13
రాజాపూర్	6	18
రత్నాపూర్	10	31
సుందిల్లా	25	42
పన్నూరు	18	60

ఏడు వార్డులకు సింగిల్ నామినేషన్

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. మైదంబండ 1వ వార్డు బియ్యాన్ని పద్మ, 2వ వార్డు పందుల పద్మ, 3వ వార్డు ఎర్రం సౌందరయ్య, 4వ వార్డు కలవేన నవలోక, 5వ వార్డు జక్కుల చంద్రమౌళి నామినేషన్ వేశారు. దీంతో ఆయా వార్డులకు ఒకే నామినేషన్ దాఖలయ్యాయి. అడవిశ్రీరాంపూర్ 2వ వార్డుకు లక్కం లక్ష్మీ, 7వ వార్డుకు వీరగోని అజయ్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే వీరి ఏకగ్రీవంపై ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

పల్లెల్లో వేడెక్కిన రాజకీయాలు

(5వ పేజీ తరువాయి)

నాయకులు రంగంలోకి దిగుతున్నారు. ఓటర్లను తమ వైపునకు తిప్పుకొని ఎన్నికల్లో గెలుపొందేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని తహతహలాడుతున్నారు. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ మధ్యాహ్నం 3 గంటలకు ముగిసిన అనంతరం అభ్యర్థులకు ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో గుర్తు లను కేటాయించనున్నారు. ఆ మరుసటి రోజు నుంచి అభ్యర్థులు ప్రచారం నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

● నేటి నుంచి రెండో విడత

ఈ నెల 29వ తేదీ నుంచి రెండో విడత నామినేషన్ల ప్రక్రియ మొదలు కానున్నది. పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి మండలాల్లోని 73 సర్పంచ్, 684 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 10.30 గంటల నుంచి ఆయా కేంద్రాల్లో నామినేషన్లను డిసెంబరు 2వ తేదీ వరకు స్వీకరించనున్నారు. మూడో తేదీన అభ్యంతరాలకు అవకాశం కల్పించారు. 4వ తేదీన పరిశీలన, 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. 14వ తేదీన ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనున్నది.

మంత్రికి వినతి

మంథని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో నిర్మించనున్న శ్రీపాద మార్గ్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు మాజీ ఉప సర్పంచ్, న్యాయవాది సత్యనారాయణ శనివారం తెలిపారు. మంత్రి స్పందించి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

అన్నదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణరావు

సుల్తానాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శాస్త్రీనగర్ అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభించారు. అయ్యప్ప ఆలయ ట్రస్టు చైర్మన్ సాయిరి పద్మ మహేందర్‌తో కలిసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. అన్నదాన శిబిరాన్ని ప్రారంభించి అయ్యప్ప దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మికత భక్తి భావం పెరగడం వల్ల శాంతి నెలకొంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ఆలయాలను సందర్శించడం అలవర్చుకొని భక్తిభావాన్ని పెంచుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వేదపండితులు రమేష్ శర్మ, గురుస్వామి మిట్టపల్లి మురళీధర్, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నగునూరి అశోక్, జైపాల్‌రెడ్డి, చకిలం మారుతి, అమిరిశెట్టి తిరుపతి, గణేష్, కుమార్, కిషోర్, తిరుపతిరావు, ఎల్లె రాజు, శంకర్, మెరుగు వెంకటేష్, సాంబయ్య, శెట్టి శ్రీను, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

కుటుంబానికి సమయం కేటాయించాలి



ఏఆర్ఎస్ఐని సన్మానిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజ క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులేనని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ పరికు ద్దీన్‌ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులు కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించాలన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు రేపటితరం పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐలు మల్లేషం, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



పెద్దపల్లి బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

పెద్దపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. జర్నలిస్టులకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. హైదారాబాద్ రాష్ట్రసమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరిగే మహాధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు మల్లవజ్జల వంశీ, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్, టికె శ్రీనివాస్, రాష్ట్ర మఫిషియల్ కమిటీ సభ్యులు సామల హరికృష్ణ, జిల్లా నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాగేపల్లిలో నామినేషన్‌పై వివాదం

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నాగేపల్లి గ్రామపంచాయతీ రెండో వార్డు బీసీ మహిళకు రిజర్వు కాగా పోతు జ్యోతిరెడ్డి నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చారు. ఆర్వో బీసీ ధ్రువీకరణ అడుగగా నామినేషన్ స్వీకరించాలని ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. కొందరు నాయకులు ఉన్నతాధికారుల ద్వారా ఒత్తిడి తెచ్చి రిజర్వు స్థానంలో జనరల్ ఫీజు తీసుకుని నామినేషన్ స్వీకరించేలా ఒప్పించినట్లు సమాచారం. బీసీ ధ్రువీకరణ పత్రం లేకుండా నామినేషన్‌ను ఆమోదిస్తారా లేక తిరస్కరిస్తారా అనే సందేహం నెలకొంది. దీనిపై ఎంపీడీవో శైలజారాణిని వివరణ కోరగా జనరల్ ఫీజు చెల్లించాలని, స్ర్కూటిని సమయంలోగా బీసీ సర్టిఫికేట్ నామినేషన్‌కు జత చేయాలని లేని పక్షంలో నామినేషన్‌ను పరిగణలోకి తీసుకోమని ఎంపీడీవో వివరణ ఇచ్చారు.

కేసీఆర్ దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు

గోదావరిఖని, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఆమరణ దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని, అన్ని వర్గాలను ఒక్కతాటిపైకి తెచ్చి సకలజనుల సమ్మెతో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించారన్నారు. తెలంగాణ ప్రజలను ఏకం చేసి ప్రత్యేక రాష్ట్రం వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అని రణగర్జన చేసిన 2009 నవంబరు 29న రోజే దీక్ష దీవస్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ఎప్పటికీ మరువలేమని, ప్రతీ తెలంగాణ బిడ్డ గుర్తుంచుకోవాల్సిన రోజు దీక్షా దివాస్ అన్నారు. కేసీఆర్ అలుపెరుగని పోరాటంతోనే తెలంగాణ సిద్ధించిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అనేక రాస్తారోకోలు, ధర్నాలు, పోరాటాలు చేసి తెలంగాణ తెచ్చుకున్నామని, ఇప్పుడున్న కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పెడుతుందన్నారు. కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, గాదం విజయ, జనగామ కవిత సరోజిని, బాదె అంజలి, చెలకలపల్లి శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, బుర్రి వెంకటేష్, దొమ్మేటి వాసు, జక్కుల తిరుపతి, నారాయణదాసు మారుతి, నీరటి శ్రీనివాస్, కోడి రామకృష్ణ, కిరణ్ జీ, చింటు, యాసర్ల తిమోతి, ఓదేలు, ఆవునూరి వెంకటేష్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): దీక్ష దివస్ సందర్భంగా శనివారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని, అన్నీవర్గాలను ఒక్క తాటిపైకి తెచ్చి సకల జనుల సమ్మెతో ఢిల్లీ పెద్దల మెడలు వంచి తెలంగాణను సాధించారన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ఎప్పటికీ మరువలేమని, చరిత్రలో మరిచిపోలేని రోజు నవంబర్ 29 అని అన్నారు. నాయకులు గాదం విజయ, కృష్ణవేణి, కవిత, అంజలి, చెలుకలపెల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, దొమ్మేటి వాసు, బుర్రి వెంకటేష్, నారాయణదాసు మారుతి, కోడి రామకృష్ణ, జక్కుల తిరుపతి పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): దీక్షా దీవస్ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పండ్లు, బ్రెడ్, పాలు శనివారం పంపిణీ చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేసిన పుప్పాల తిరుపతి, పిల్లి సత్తయ్యలను పుట్ట మధు అబినందించారు. బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, గొబ్బూరి వంశీ, కాయితి సమ్మయ్య, కుమార్‌లు పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు హరీష్‌రెడ్డి ఆరోపించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు రాక్షస పాలన కొసాగిస్తున్నారన్నారు. గుంపుల వద్ద చెక్ డ్యాంను ధ్వంసం చేసినా పట్టించుకోవడం లేదని, అది కుంగిపోయిందంటూ అబద్దపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. శివ, అనుముల కళావతి పాల్గొన్నారు.

హక్కుల కోసం కృషి చేసిన అంబేద్కర్

కోల్‌సిటీటౌన్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): బీసీలకు, మహిళల హక్కుల కోసం అంబేద్కర్ కృషి చేశారని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్ అన్నారు. రాజ్యాంగ అమలు వారోత్సవాల్లో భాగంగా శనివారం శివాజీనగర్ అంబేద్కర్ భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీలకు రాజ్యాధికారం, మహిళలకు పురుషులతో సమాన హక్కులు కావాలని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడితే బిల్లును అడ్డుకోవడంతో అంబేద్కర్ రాజీనామా చేశారన్నారు. పేరుక రవి, అరుణ్‌కుమార్, రాజు, హనుమంతు,కొమురయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా నడవాలి



సత్యనారాయణను సన్మానిస్తున్న టీఎన్జీవోల సంఘం రాష్ట్రఅధ్యక్షుడు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘ సభ్యులు కలిసికట్టుగా నడవాలని, సంఘాలకు, నాయకులకు అండగా నిలవాలని టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. శనివారం పెద్దపల్లిలో టీఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యదర్శి పిస్క సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్ మాట్లాడుతూ సత్తన్న పదవీ విరమణ పొందడం సంఘానికి తీరని లోటని అన్నారు. కరీంనగర్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, గడియారం శ్రీహరి, నాగేందర్ రెడ్డి, కార్యదర్శులు లక్ష్మణ్ రావు, రామ్మోహన్, అమరేందర్ రెడ్డి, పీఏఓ ప్రభాకర్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస చారి, ప్రసాద్, శ్రీనివాస్, మధుమతి పాల్గొన్నారు.



డిస్పెన్సరీని తనిఖీ చేసిన చీఫ్ మెడికల్ ఆఫీసర్

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలోని డిస్పెన్సరీని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌రాజు శనివారం తనిఖీ చేశారు. డిస్పెన్సరీని ఆవరణ, రికార్డులను పరిశీలించారు. స్టాఫ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, సిసిడి డిస్పెన్సరీ ఇంచార్జ్ దుబ్బాక జ్యోతిరెడ్డి, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగికి సన్మానం

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో పదవీ విరమణ పొందుతున్న ఫైనాన్స్ విభాగంలో జనరల్ అసిస్టెంట్ సరోత్తమ్‌ను ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు సన్మానించారు. అధికారులు బండి సత్యనారాయణ, సురేఖ, సుదర్శనం, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బదిలీ పై వెళ్తున్న అధికారికి

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 డివిజన్‌లో ఏరియా ఇంజనీర్‌గా విధులు నిర్వహించి కార్పొరేట్ ఈఅండ్ ఎం డైరెక్టర్ కార్యాలయానికి ఎస్వోటూ డైరెక్టర్‌గా బదిలీ పై వెళ్తున్న వైవి శేఖర్‌బాబును శనివారం జీఎం కార్యాలయంలో జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు సన్మానించి వీడ్కోలు పలికారు. అధికారులు సత్యనారాయణ, కాశీవిశ్వేశ్వర్‌రావు, రాజేంద్రకుమార్, మురళికృష్ణ, రాజారెడ్డి, సిజె సురేఖ, సుదర్శనం, ఐలయ్యలు పాల్గొన్నారు.

ఆర్జీ-3లో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం



రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో శనివారం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పై చర్చించారు. అందులో ప్రధానంగా పెన్షన్ పెరుగుదల, అన్ లిమిటెడ్ మెడికల్ వసతి, గృహ వసతితో పాటు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలనే డిమాండ్‌ల పై నిర్ణయం తీసుకున్నారు. నాయకులు గౌతంశంకరయ్య, వేగొలపు మల్లయ్య, చిలుకల జవహర్, సత్యనారాయణ, మహ్మద్ రఫీ, శేషగిరి, మహేందర్, వెంకటేశ్వర్లు, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలో రాజ్యాంగ దినోత్సవం

రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఎపిఎ డివిజన్ పరిధి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఎస్సీ-ఎస్టీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆకునూరి బాలంకూస్, ఏఎల్‌పి మేనేజర్ పెంచలయ్య, గంగాధర్‌రెడ్డి, శరత్ వెంటిలేషన్ నందిత్‌కుమార్, సేఫ్టీ ఆఫీసర్ కమలాకర్‌లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అండర్ మేనేజర్ అనిల్, శ్రీనివాస్, సమ్‌సన్, గడ్డం రమేశ్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యా పరిరక్షణ కమిటీ బృందం కలెక్టర్ కోయశ్రీహర్షను కలిసింది. ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేట, సుల్తాన్‌పూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయ బృందం నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. పాఠశాలకు మరో ముగ్గురు ఉపాధ్యాయులు, రెండు అదనపు గదులు మంజూరుకు వినతిపత్రం అందించారు. అన్ని పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ పాఠశాలలను నిర్వహించాలని కోరినట్లు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, రఘుశంకర్‌రెడ్డి, ఉన్నారు.

జిల్లా కార్యవర్గం

విద్యాపరిరక్షణ కమిటీ, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా రాంకిషన్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా సీవీ జీవన్‌రాజు, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, సత్యనారాయణ, లింగమూర్తి, దేవెందర్‌గౌడ్, కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా పరుశరాములు, అసోసియేట్ ప్రధాన కార్యదర్శి సురేష్‌కాచే, కార్యదర్శులు రఘుపతిరావు, శ్రీనివాస్, నంబయ్యా, కిషన్‌రావు ఎన్నుకున్నారు.